



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
జూలై 27, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదు ::: హరీష్‌రావు



## కాంగ్రెస్ కులగణన బూటకం

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



## ఈసీ పక్షపాత అంపైరింగ్: రాహుల్



## చంద్రబాబుకు రేవంత్ పెద్ద కోవర్టు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ : బనకచర్ల పేరుతో గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూ రం చేసే కుట్రను చంద్రబాబు, రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. తెలంగాణ జల హక్కులకు పిండం పెట్టే ఆ కుట్రను ఆపడానికి కెసిఆర్ ఉన్నాడన్న సం గతిని చంద్రబాబు మర్చిపోవద్దని హెచ్చరించారు. మల్లాపూర్‌లోని విఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం జరిగిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం(బిఆర్ఎస్వి) రాష్ట్ర స్థాయి సదస్సులో కెటిఆర్, మాజీ మంత్రులు, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి తదితరలు హాజరై బనకచర్లతో తెలంగాణ రాష్ట్రానికి జరిగే

(మిగతా 2వ పేజీలో)

# జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం

### చర్చ లేకుండా బిల్లు ఆమోదం పొందడంలో కీలక పాత్ర

### దేశంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత

### 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన నాయకుడు మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చూపిన చొరవే కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో పనిచేసిన జైపాల్‌రెడ్డి దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్, కేపిటల్ ఫౌండేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో.. రచయిత, ఆర్థిక నిపుణులు మోహన్ గురుస్వామికి 'ఎస్.జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు'ను ప్రదానం చేసిన అనంతరం సీఎం ప్రసంగించారు.

**తెలంగాణలో పీవీ తర్వాత జైపాల్‌రెడ్డే..**

జైపాల్‌రెడ్డి పాత్ర లేకపోతే ఇవాళ ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదని రేవంత్‌రెడ్డి చెప్పారు. చర్చ లేకుండానే పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని, జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియాగాంధీ కూడా ఒక సందర్భంలో తనతో చెప్పారని తెలిపారు. కాంగ్రెస్‌ను వీడినా, తిరిగి కాంగ్రెస్‌లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం

(మిగతా 2వ పేజీలో)





### సింగపూర్ లో 5 రోజుల పాటు

## సీఎం చంద్రబాబు బృందం పర్యటన

### సింగపూర్ ను అత్యంత విలువైన భాగస్వామిగా పేర్కొన్న చంద్రబాబు

### బ్రాండ్ ఏపీని ప్రోత్సహించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని ఆశాభావం

ఏపీకి పెట్టుబడుల రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం నేడు సింగపూర్ వెళుతోంది. ఈ పర్యటన ఐదు రోజుల పాటు సాగనుంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో

(మిగతా 2వ పేజీలో)



## మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల వరద

### త్రివేణి సంగమం వద్ద పుష్కరఘాట్లను తాకిన నీరు

దోమలపెంట: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత వరద తాకిడితో గోదావరికి ప్రవాహం పెరుగుతోంది. శనివారం పుష్కరఘాట్లను తాకు తూ నీటిమట్టం దిగువకు ప్రవహించింది. దీంతో కాళేశ్వరం వద్ద 8.700 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌కి వరదనీరు చేరి 3.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలిరాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో వరద నీటిని ఔట్‌ఫ్లో రూపంలో దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, మేడిగడ్డ బరాజ్ వంతెన మీదుగా భారీ వాహనాలు రాకుండా ఇరిగేషన్‌శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్య లు తీసుకున్నారు. వరద తాకిడి

(మిగతా 2వ పేజీలో)

## టీచర్ల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్



హైదరాబాద్ : రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపిం ది. ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల ద స్త్రంపై శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేసినట్లు సమాచారం. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయు లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివి ధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో ప్రమోషన్లు ఉ పాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. రెం డు మూడు రోజుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించగా, వివిధ కారణాల వల్ల మల్టీజోన్-2లో పోస్టులు మిగిలిపోయాయి. అలాగే పదవీ విరమణ వల్ల సుమారు

(మిగతా 2వ పేజీలో)



## మాల్దీవుల అభివృద్ధికి భారత్ సహకారం

### ::: ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

మాలె: మాల్దీవులతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకొనేందుకు కట్టుబడి ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మాల్దీవుల సర్వతోముఖాభివృద్ధికి సహకారం కొనసాగిస్తామని ప్రకటించారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షల సాకారానికి తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం మాల్దీవుల ఉపాధ్యక్షుడు ఉజ్ హుస్సేన్ మొహమ్మద్ లతీఫ్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులను కలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణ మార్పుల నియంత్రణ సహా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారంపై అతీఫ్‌తో చర్చించారు. ప్రధాని మోదీ మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిపబ్లిక్ స్క్వే ర్‌లో 50 నిమిషాలపాటు ఈ వేడుకలు జరిగాయి. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతోపాటు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిలటరీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

# చంద్రబాబుకు రేవంత్ పెద్ద కోవర్టు

నష్టాన్ని వివరించా రు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, తెలంగాణ జలాలు మనకు కాకుండా చేసే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గద్ద పాత్రను పోషిస్తుందని విమర్శించారు. సముద్రంలో కలిసే 3000 టిఎంసిల గోదావరి మిగులు జలాల్లో 950 టిఎంసిలను దామాషా ప్రకారం తెలంగాణకు కేటాయించిన తర్వాత ఎపిలో ఏ ప్రాజెక్టు కట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. అలాగే 1486 టిఎంసిల గోదావరి నికరజలాల్లో 968 టిఎంసిలను తెలంగాణకు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్ ఆపేదాక తాము పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. తెలంగాణ గొంతు కోస్తుంటే చూస్తూ ఊరుకోవడానికి బిఆర్ఎస్ సిద్ధంగా లేదని హెచ్చరించారు. కాంగ్రెస్, బిజెపి, చంద్రబాబు నాయుడు కలిసి తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పతాక అయిన బిఆర్ఎస్‌ను లేకుండా చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లు మాట్లాడడానికి కూడా భయపడ్డ తెలంగాణ వ్యతిరేకులు రేవంత్ రెడ్డి సిఎం కాగానే విర్రవీగుతూ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొహబ్బత్ కా దుకాణ్ అంటూ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో రేవంత్ రెడ్డి సాగిస్తున్న విధ్వంసక పాలన కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణలోని ప్రతీ వర్గాన్ని మోసం చేసిన కాంగ్రెస్ అరాచకాలపై బిఆర్ఎస్ పోరాడితేనే మూసీ ప్రక్షాళన, లగచర్ల, కంచె గచ్చిబౌలి అక్రమాలు ఆగాయని తెలిపారు.



### మిత్తితో సహా చెల్లిస్తాం%ౌ%పోలీసులకు కెటిఆర్ హెచ్చరిక

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థఘోరంగా తయారైందని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న రేవంత్ రెడ్డి కట్టు బానిసలైన పోలీసు అధికారుల పేర్లు రాసుకుని అధికారంలోకి వచ్చాక మిత్తీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. పోలీసులు చేయాల్సిన పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఎవరూ సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారో కనుక్కోవడమే పోలీసుల పనిగా మారిందని విమర్శించారు. తెలంగాణ పోలీసులు రేవంత్ రెడ్డి కట్టు బానిసలుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని.. రేవంత్ బానిసలుగా పని చేస్తున్న ఒక్కో పోలీసు పేరు రాసి పెట్టుకోవాలని బిఆర్ఎస్ శ్రేణులకి పిలుపునిచ్చారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని లెక్కలు వడ్డీతో సహా కలిపి చెల్లిస్తామని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాయని.. తాము కూడా ట్యాపింగ్ చేస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారని గుర్తుచేశారు. అధికారులు ట్యాపింగ్ చేస్తే చేయొచ్చని రేవంత్‌రెడ్డి అన్నారని చెప్పారు. కెసిఆర్ నాట్ల సమయంలో రైతుబంధు ఇస్తే%ౌ% రేవంత్‌రెడ్డి ఓట్లప్పుడు ఇస్తున్నారని విమర్శించారు. మనకి సోషల్ మీడియా సపోర్ట్ తప్పా.. ఏ మీడియా సపోర్ట్ లేదని, సోషల్ మీడియాలో మన తడాఖా చూపెట్టాలని కెటిఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు.

### తెలంగాణపై కుట్రలు చేసేది కాంగ్రెస్, బిజెపి, టిడిపి పార్టీలే : హరీష్

ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్‌ను తలుచుకోకుండా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగం ఉండదని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. బిఆర్ఎస్‌వి రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏనాడు జై తెలంగాణ అనని వ్యక్తి రేవంత్ రెడ్డి అని,ఇప్పుడు జై డిల్లీ, జై సోనియా, జై మోదీ అంటున్నాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయకుండా పారిపోయింది కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులపై తుపాకీ పెట్టి రైఫిల్ రెడ్డిగా ఆయన మిగిలిపోయారని ధ్వజమెత్తారు. తెలంగాణ ద్రోహుల చరిత్ర రాస్తే చంద్రబాబు పేరు మొదలు ఆ తర్వాత రేవంత్ పేరు వస్తుందని అన్నారు. కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం పట్ల ఓ విజనరీ ఉన్న నాయకుడు అని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు, నియామకాలనే ఉద్యమ ట్యాగ్ లైన్‌తో గోదావరి, కృష్ణా జలాలను బీడు భూములకు మళ్లించిన అపర భగీరథుడు తమ కెసిఆర్ అని పేర్కొన్నారు. కానీ, ప్రస్తుతం నీళ్లు ఆంధ్రాకు, నిధులు రాహుల్ గాంధీకి వెళ్తున్నాయని విమర్శించారు. బిజెపి, కాంగ్రెస్,టిడిపి పార్టీలు కలిసి తెలంగాణపై కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. నీటి దోపిడీపై ఆ కుట్రలను బద్దలు కొట్టాలని హరీష్ రావు అన్నారు.

# మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల వరద

పెరిగిన నేపథ్యంలో మహారాష్ట్ర మీదుగా తెలంగాణలోకి బరాజ్‌పై వంతెన ద్వారా రాకుండా గేటును వెల్డింగ్ చేశారు.

### సమ్మక్క సాగర్‌కు 5,28,450 క్యూసెక్కుల నీరు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బరాజ్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలోని వాగులు, ఒర్రెలు, చెరువుల నుంచి గోదావరిలోకి వరదనీరు వస్తోంది. దీంతో మేడిగడ్డ, సరస్వతి బరాజ్ నుంచి వరదనీరు సమ్మక్క సాగర్ బరాజ్‌లోకి చేరుతోంది. శనివారం ఎగువ నుంచి 5,28,450 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో బరాజ్ వద్ద 59 గేట్లలో 44 గేట్లను ఎత్తి 5,65,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బరాజ్ వద్ద నీటి మట్టం 83 మీటర్లకు 80.05 మీటర్లు కొనసాగుతోంది. బరాజ్‌త సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### శ్రీశైలంకు కొనసాగుతున్న ప్రవాహం

జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం రాత్రి 7 గంటలకు జూరాల స్పిల్‌వే ద్వారా 35,820 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,286, సుంకేసుల నుంచి 31,928 మొత్తం 1,02,034 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 53,764 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,929 మొత్తం 66,244 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.4 అడుగుల నీటిమట్టం వద్ద 201.1205 టీఎంసీల నీటి నిల్వ ఉంది.



# టీచర్ల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్


750 గెజిటెడ్ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి ఈ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది. అదేవిధంగా గెజిటెడ్ హెచ్ఎం పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్‌జిటిలతో భర్తీ చేయనున్నారు. డిఎస్‌సి – 2012 తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుని పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెచ్ఎంలు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా టీచర్ల పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

### మరో 790 ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరో 790 ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 210 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు కొనసాగుతుండగా, తాజాగా మరికొన్ని సర్కారు బడుల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో మొత్తం 1000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులు నడుస్తున్నాయి. పిల్లలకు మూడేళ్ల వయసు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని, దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో ప్రైమరీ ప్రైమరీ ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ చేసింది.

### నాలుగేళ్ల వయసులో అడ్మిషన్

వచ్చే విద్యాసంవత్సరం ఒకటో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు సర్కారు బడుల్లో నిర్వహించే ప్రీ ప్రైమరీ తరగతుల్లో ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం ఐదేళ్లు నిండిన పిల్లలకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా, ప్రీ ప్రైమరీలో నాలుగేళ్లు నిండిన పిల్లలకు ప్రవేశాలు ఇవ్వనున్నారు. పాఠశాల విద్యాశాఖ, మహిళా సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో ప్రై ప్రైమరీ స్కూళ్లు కొనసాగునున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు ఒక తరగతి గదిని ప్రత్యేకంగా ప్రీ ప్రైమరీకి కేటాయించాలని మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ తరగతి గదిని చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నీచర్, వెంటిలేషన్ ఉండేలా చూడటంతోపాటు ఆ క్లాస్‌ను పిల్లలు సురక్షితంగా ఉండేలా సుందరంగా అలంకరించాలని తెలిపారు.



# నేడు కూడా ఢిల్లీలోని ఏపీ భవన్ లో ‘హరిహర వీరమల్లు’ ప్రదర్శన

**ఏపీ భవన్ లో రెండు రోజుల పాటు హరి హర వీరమల్లు చిత్ర ప్రదర్శన**

**నిన్న రాత్రి మొదటి షోకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో పూర్తిగా నిండిపోయిన ఆడిటోరియం**

**ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన పాన్ ఇండియా మూవీ హరి హర వీరమల్లు**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన పాన్ ఇండియా మూవీ ‘హరి హర వీరమల్లు’ ఈ నెల 24న విడుదలైంది. ఈ చిత్రం భారీ ఓపెనింగ్స్‌తో పాటు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనలు అందుకుంది. ఈ నేపథ్యంలో, దేశ రాజధాని ఢిల్లీలో స్థిరపడిన తెలుగు వారికి ఈ చిత్రాన్ని చేరువ చేసేందుకు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రెండు రోజుల పాటు ప్రదర్శించనున్నారు. నిన్న రాత్రి 7 గంటలకు జరిగిన మొదటి షోకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో ఆడిటోరియం పూర్తిగా నిండిపోయింది. ఈరోజు (ఆదివారం) కూడా రెండు షోలను ప్రదర్శించనున్నారు. ఢిల్లీలో విధుల్లో ఉన్న తెలుగు అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న తెలుగు ప్రజల కోసం ఏపీ భవన్‌లో ఈ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వారాంతపు సెలవు దినాలైన శని, ఆదివారాల్లో ఏపీ భవన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ప్రకటించారు. రోజుకు రెండు షోలు ప్రదర్శిస్తున్నట్లు ఆయన వివరించారు.

# జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం

ఆయన ఎన్నడూ పార్టీలు మారలేదని చెప్పారు. పెట్రోలియం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని, సమాచార శాఖ మంత్రిగా ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. పార్లమెంటులో రాణించిన వాజ్‌పేయి మొదలుకుని అనేకమంది మేధావుల్లో ఎవరితోనూ జైపాల్‌రెడ్డికి వ్యక్తిగత వైరం లేదని, చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో పీవీ నరసింహారావు తర్వాత అంత పేరు తెచ్చుకున్న నాయకుడు జైపాల్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని, పీవీ, జైపాల్‌రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని చెప్పారు.



### ఇప్పుడంతా స్విగ్గీ పాలిటిక్స్

పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపైనే జైపాల్‌రెడ్డి ఎక్కువ ఆలోచించేవారని, రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ప్రయత్నించారని రేవంత్ చెప్పారు. అయితే నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని, దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ వచ్చాయని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని, యూనివర్సిటీల్లో విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా ‘భారత్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముందున్న సవాళ్లు’అనే అంశంపై రాజ్యసభ సభ్యుడు శస్మిత్ పాత్రా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ వీసీ ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేశ్, కేపిటల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రదానం చేశారు.

# రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదు ::: హరీష్‌రావు

హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా మాజీ సిఎం కెసిఆర్ గుర్తుకు వస్తున్నారని మాజీ బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. గోదావరి–బనకచర్లకు కలిగే నష్టంపై బిఆర్ఎస్వీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ సందర్భంగా హరీష్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదని, రేవంత్ ఎక్కడ మాట్లాడినా కెసిఆర్ పేరును ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. ఉద్యమ గుర్తులు, చరిత్ర చెరిపేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని, రేవంత్ రెడ్డి పాలనలో నీళ్లు ఆంధ్రాకు.. నిధులు దిల్లీకి పంపిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బిజెపి, చంద్రబాబు నాయుడు కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, కృష్ణా, గోదావరి జిల్లాల్లో వాటాను కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉందని అన్నారు. గురుశిష్యులు కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తానని హరీష్ రావు పేర్కొన్నారు.

# ఈసీ పక్షపాత అంపైరింగ్: రాహుల్

ఆనంద్: ఎన్నికల సంఘం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పక్షపాత ఎంపైర్‌గా పనిచేస్తోందని క్రికెట్ పరిభాషలో మండిపడ్డారు. 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఎన్నికల సంఘమే కారణమని విమర్శించారు. అప్పట్లో తప్పుడు ఓటర్ల జాబితాను ఈసీ రూపొందించిందని ఆక్షేపించారు. క్రికెట్‌లో మనం తప్పులు చేయకపోయినా పదేపదే ఔట్ అవుతున్నామంటే అందుకు అంపైర్ పక్షపాత వైఖరే కారణమవుతుందని చెప్పారు. శనివారం గుజరాత్‌లోని ఆనంద్ పట్టణంలో ‘సంఘటన్ సుజన్ అభియాన్’లో రాహుల్ పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. దేశాన్ని ఒక దేవాలయంగా అభివర్ణించారు. అక్కడికి ఎవరైనా వచ్చి ప్రార్థనలు, పూజలు చేసుకోవచ్చని చెప్పారు. కానీ, ప్రసాదం ఎవరికి దక్కాలన్నది బీజేపీ%–%ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తున్నాయని ఆక్షేపించారు. గుజరాత్‌లో అధికార బీజేపీని కచ్చితంగా ఓడించాలని, అందుకోసం ఇప్పటి నుంచే కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. గుజరాత్‌లో ఆ పార్టీని మట్టికరిపిస్తే కాంగ్రెస్‌కు ఇక తిరుగుండదని తేల్చిచెప్పారు. బీజేపీని గుజరాత్‌లో ఓడిస్తే ఎక్కడైనా ఓడించడం సులభమేనని సూచించారు. ‘మిషన్ 2027’రోడ్‌మ్యాప్‌పై ఈ కార్యక్రమంలో చర్చించారు.

# ‘కాంగ్రెస్ కులగణన బూటకం’

మహబూబ్‌నగర్: కాంగ్రెస్ చేపట్టిన కులగణన బూటకమని విమర్శించారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది బీసీలను మోసం చేయటమేనన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమన్నారాయన. ఈ రోజు(శనివారం, జూలై 26) మహబూబ్‌నగర్‌లో పర్యటించిన రాంచందర్‌రావు.. గతంలో ఎమ్మెల్సీగా గెలిపించిన పాలమూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పాలమూరు నుంచి ఇంకా వలసలు తగ్గడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై దృష్టి సారించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు,. రేవంత్‌రెడ్డికి ఢిల్లీ తిరగటమే సరిపోయిందంటూ ఎద్దేవా చేశారు. భవిష్యతఖ్‌లో పాలమూరు బీజేపీకి అడ్డాగా మారబోతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంత పెద్ద నాయకుడైనా పార్టీనే సుప్రీం అని ఆయన స్పష్టం చేశారు.

# సింగపూర్ లో 5 రోజుల పాటు సీఎం చంద్రబాబు బృందం పర్యటన

స్పందించారు. ఈ రాత్రికి సింగపూర్ వెళుతున్నామని వెల్లడించారు. అభివృద్ధిలో తమకు అత్యంత విలువైన భాగస్వామి, శక్తిమంతమైన తెలుగు సమాజానికి నెలవుగా ఉన్న దేశం సింగపూర్ అని కొనియాడారు. “రేపు సింగపూర్ మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, తెలుగు డయాస్పొరా సభ్యులను కలవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో సింగపూర్ ఒక కీలక భాగస్వామిగా ఉంది. ఆసియాలో అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, దార్శనిక దేశంగా సింగపూర్ వర్ధిల్లుతోంది. లోతైన సహకారం దిశగా విలువైన అవకాశాలను అందిస్తుంది. మా విశ్వసనీయ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, అంతర్జాతీయ వేదికపై బ్రాండ్ ఏపీని ప్రోత్సహించడానికి, నూతన ప్రగతిశీల విధానాలను చాటిచెప్పడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. అంతేకాదు, సమ్మిళిత వృద్ధి దిశగా శాశ్వత సహకారాలను నెలకొల్పేందుకు ఇదొక అవకాశం” అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కాగా, సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఉన్నతాధికారులు కూడా వెళుతున్నారు.

## కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత ఆలయంలో లక్ష పుష్పార్చన.




కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, జూలై 26: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్ లో గల గణేశ నవదుర్గా మండలి ఆధ్వర్యంలో శ్రీ త్రిశక్తి మాత ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ శ్రావణమాసం మహిళలకు అతి పవిత్రమైన మాసంగా పిలవబడుతుందని, అందులో భాగంగానే శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం నిర్వహించి, అనంతరం లక్ష పుష్పార్చన కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘ సుమంగళి ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పెద్దగా ఉవాచ తిథిలతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణమాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు.ఈ శ్రావణమాసంలో శివకేశవులను నిష్టతో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారని కటుకం గణేష్ అన్నారు.శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈ మాసంలో ప్రతిరోజు విశిష్టతతో కూడుకున్నదే.ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని భక్తుల నమ్మకం.ఈ శ్రావణమాసంలోనే వ్రతాలు, నోములు, ఉపవాసాలు పూజలు ఆచరిస్తారు.అందుకే ఈ మాసాన్ని ఆధ్యాత్మిక మాసం అని కూడా అంటారని కటుకం గణేష్ వివరించారు.అంతేకాకుండా శ్రావణమాసం మహిళలకు ఎంతో ప్రీతికరమైన పవిత్రమైన మాసం.ఎందుకంటే మహిళలు చేసే వ్రతాలు ఈ నెలలో ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ నెలను వ్రతాల మాసం అని, సౌభాగ్యాన్ని అందించే మాసమని పెద్దలు చెబుతారని ఆయన పేర్కొన్నారు.ఆలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని కటుకం గణేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్,ప్రధాన కార్యదర్శి గజ్జెల శంకర్, కోశాధికారి అడువాల ప్రభాకర్, సభ్యులు గాజుల రమేష్, లక్కంపల్లి విజయ్, చింతకింది సత్యనారాయణ, కార్తీక్, ఆలయ అర్చకులు శివ పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో డబ్బుంటే ఫైవ్ స్టార్ సేవలు, దర్శనాలు, ఆశీర్వచనాలు..

### తిరుపతి కి పోటీగా తయారు చేస్తున్నారని

### ఆనందించాలా..! ధరల ప్యాకేజీలను చూసి భయపడాలా..



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి శ్రావణమాసం వచ్చేసింది కదా, ఇక యాదగిరిగుట్టలో సందడి పెరుగుతున్నదీ అనే వార్త ఒకటి కనిపించింది ఇంతకుముందు దర్శనాలు, రాత్రి నిద్రలు కానీ కాలం మారింది కదా గిరిప్రదక్షిణలు, సత్యనారాయణ వ్రతాలు కూడా ఇవి చదువుతుంటే మూణ్నాలుగు రోజుల క్రితం వార్త ఒకటి గుర్తొచ్చింది "త్వరలో యాదగిరి అని ఓ మాసపత్రిక తీసుకొస్తాం ఓ టీవీ చానెల్ పెడతాం ఇకపై సత్యనారాయణ స్వామి వ్రతం టికెట్టు 1000, శ్రీవాణి ట్రస్టు తరహాలో 5 వేల రూపాయలతో గరుడ టికెట్లు 4 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు, 20 కోట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, కొండ కిందే వాహనపూజ సౌకర్యం'ఇదీ సారాంశంఅంతేకాదు, సదరు శ్రీవాణి ట్రస్టు తరహా 5 వేల రూపాయల గరుడ టికెట్టు ప్యాకేజీ కూడా అధికారులు చెప్పారు%ౌ% "సుప్రభాత సేవ నుంచి శయనోత్సవం వేళ వరకు అంతరాలయ దర్శనం, ఏ సమయంలోనైనా దర్శనం, గుట్ట పైవరకూ వాహన అనుమతి, వేద ఆశీర్వచనం, కండువా, కనుము, 5 లడ్డూలు, కిలో పులిహోర ఈ స్వామి వారిని తిరుపతి శ్రీవారికి పోటీగా తయారు చేస్తున్నారని ఆనందించాలా..? రకరకాల ప్యాకేజీలు, ఈ ధరల్ని చూసి విస్తుపోవాలా..? ఏ మతమైనా తమ ప్రార్థన కేంద్రాలను వీలైనంతవరకూ చారిటీతో, ధర్మప్రచార కేంద్రాలుగా డెవలప్ చేస్తుంది ఆధ్యాత్మిక వాతావరణం క్రియేట్ చేస్తుంది కానీ మనం..?వీలైనంత ఎక్కువ మంది భక్తులు రావాలని ఆశిస్తుంది ఏ గుడైనా..! సత్యనారాయణస్వామి వ్రతానికి ఏకంగా 1000 రూపాయలట ఎక్కడ ఎంత వీలైతే అంత భక్తుల జేబుల నుంచి దండుకోవడమేనా..? రూ. 5 వేలు కడితే ఎప్పుడంటే అప్పుడు అంతరాలయంలోకి తీసుకెళ్తారట, వేద ఆశీర్వచనం అట ఇది యాదగిరిగుట్ట సంగతి..!



## పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్స్ అందజేసిన కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

వార్త మిర్రర్, మౌలాలి: మౌలాలి డివిజన్ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్స్ పంపిణీ శ్రీమతి గున్నాల సునీత యాదవ్ కార్పొరేటర్ గారిచే పంపిణీ చేయనైనది.పారిశుధ్య కార్మికులు పరమాత్ముని సేవకులు లాంటివారని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సేవా భావం కలిగిన వారు సమాజ ఆరోగ్య కార్యకర్తలని హైదరాబాద్ మహానగరంలో తీవ్ర వర్షాలు పడుతున్నా కానీ ప్రజలు తమ నివాసాలలో ఉన్నా కానీ పారిశుధ్య కార్మికులు మాత్రం వర్షంలో రోడ్ల పైన నీటి వరద కాలువలలో అత్యవసర పరిస్థితులలో నాళాలలోని చెత్తచెదారాలు తొలగించుట నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను నీరు పోయేటట్లు చేయుట తదితర కార్యక్రమాలు చేపడుతున్నారని అటువంటి వారి సేవలను ప్రజలు గుర్తించి ఇంకా వారి నీ ఇబ్బందులు పెట్టకుండా ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తమ ఇంటిలోని చెత్తను జాగ్రత్తగా స్వచ్ఛ ఆటో టిప్పర్ కు మాత్రమే అందించాలని నాలా లలో బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయరాదని వార్డు ప్రజలను విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిడ్స్ ఇవ్వటం చాలా సంతోషంగా ఉన్నదని వారి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం అని తెలిపారు. ఇచ్చినటువంటి ఆరోగ్య పరిరక్షణ కిడ్స్ ఉపయోగించు కోవాలని వర్షా కాలంలో తప్పనిసరిగా విధులకు వచ్చేటప్పుడు రెయిన్ కోర్టు, గ్లౌజు వాడాలని తెలిపినారు. కార్మికులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ప్రజలకు పారిశుధ్య సమస్యలు ఎదురైతే ఉపేక్షించేది లేదని జిహెచ్ఎంసి అన్ని రకాలుగా సదుపాయాలు కల్పిస్తుందని అందుకు మీ వంతుగా డివిజన్ ని పారిశుద్ధ్యంలో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దాలని కోరినారు. కార్యక్రమంలో చింత శ్రీనివాస్ శానిటరీ సూపర్వైజర్ అజయ్, యాదగిరి, కిష్టమ్మ భారతి, అంజమ్మ, మనీషా, ఊర్మిళ,భాస్కర్ రావు, సంగీత ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# నిత్య ఉచిత అల్పాహారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి అందించడం అభినందనీయం

### ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ జులై 26:-( వార్త మిర్రర్) నిత్య ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం లయన్స్ క్లబ్ నిర్వహించడం అభినందనీయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం నిత్య ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్షులు బిఎం.నాయుడు కార్యదర్శి కూటాల రాంబాబు, కోశాధికారి నారాయణరావుల ఆధ్వర్యంలో అన్ని లయన్స్ క్లబ్ ల సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమం ఎమ్మెల్యే బిఎల్ఆర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం నిరంతరం అల్పాహారం వితరణ కార్యక్రమము నిర్వహించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ముందుకొచ్చి మరోసారి మీల్స్ అండ్ మీల్స్ కార్యక్రమం చేపట్టడం హర్షనీయమన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధ్యక్ష, కార్యదర్శులు బిఎం. నాయుడు, కూటల రాంబాబులు మాట్లాడుతూ పుట్టినరోజు, పెళ్లిరోజు వివిధ వేడుకలు నిర్వహించే వారు ఉచిత అల్పాహార వితరణ నిర్వహించేందుకు దాతృత్వం వహించాలని అందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. న్యూజిలాండ్ లో ఉంటున్న పృధ్వీరాజ్ కావ్యల చిన్న కూతురు దర్శిని పుట్టినరోజు సందర్భంగా డిసి లయన్ డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, జోన్ చైర్మన్ యనగండ్ల లింగయ్య-కళావతి, మిట్టపల్లి దయానంద్ లావణ్య కూతురు మిట్టపల్లి సాయిఆశ్రిత పుట్టినరోజు సందర్భంగా ఉచిత అల్పాహార వితరణకు దాతృత్వం వహించారు. పురోహితులు కృష్ణ మోహన్ శర్మ ఆశీర్వచనాలతో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎల్సిఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కర్నాటి రమేష్, మట్టి మనిషి, మాజీ సర్పంచ్ వేనేపల్లి పాండురంగారావు, లయన్స్ క్లబ్ సీనియర్ లీడర్లు ముక్కపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.రాజు, కోల సైదులు ముదిరాజ్, ఏచూరి భాగ్యలక్ష్మి, మురహరి, కే. అనంతరెడ్డి, క్యామ వెంకటేశం, శంకర్ రెడ్డి, వీరరాఘవులు, గుండా రామారావు, మధు, మంగతాయి, గట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదవ గ్రాడ్యుయేషన్ డే

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... జూలై 26 ... మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదవ గ్రాడ్యుయేషన్ డే సందర్భం గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సిఎస్ ఎల్వి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు అభి నందనలు తెలిపారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలని విద్యార్థులు విజయ వంతం గా గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దటం ఇన్ని వేల మందికి విద్యను అందిస్తున్న కృష్ణా రెడ్డి కి కళా శాల యాజమాన్యం కు అభినందనలు తెలిపారు ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు గ్రాడ్యు యేషన్ కంప్లీట్ అవగానే ఉన్నతమైన శిఖరాలను అధిరోహించే విధంగా మీరు భవిష్యత్ కార్యా చరణ ఏర్పాటు చేసుకొని రాబోయే కాలానికి మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా కోర్సుల ను ఎంపిక చేసుకుని ముందుకు సాగాలని కోరారు నేర్చుకున్న విద్యతో పాటు సంస్కారం గురువులను గౌరవించడం తల్లిదండ్రులను గౌరవించడం చదువే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేలా ఏదైనా ఒక మంచి పని నేర్చుకొని ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి సెక్రటరీ హరినాథ్ రెడ్డి ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి ప్రిన్సిపల్స్ రవిశంకర్ మురళీమోహన్ హెచ్వోడీలు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు






## డోకె బాలకృష్ణ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న - హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

### డోకె బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన క్యామ మల్లేష్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండలంలోని కునూరు గ్రామ మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ డోకె బాలకృష్ణ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,భువనగిరి పార్లమెంటు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్, డోకే బాలకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి, బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, భువనగిరి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ అబ్బగాని వెంకటేష్, బి ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, కూనూర్ మాజీ సర్పంచ్ లు అంకర్ల మురళి, చిందం మల్లికార్జున్, కటిక జంగయ్య, పుట్ట వీరేశం, రాసాల మల్లేష్, నోముల మహేందర్ రెడ్డి, చిన్నం పాండు ఎంపీటీసీలు రాసాల మల్లేష్, గ్రామ శాఖలు మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## కొత్త బోధన పద్ధతులు విషయ పరిజ్ఞానం సాంకేతిక పరిజ్ఞానం గురించి ఎప్పుడూ తెలుసుకోవాలి

### మోటివేషన్ స్పీకర్ పూర్వ ఎంఈఓ గుర్రం వెంకటేశ్వర్లు

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : సైదాబాద్ సరస్వతీ స్కూల్ లో ఉపాధ్యాయుల వ్యక్తిత్వ వికాసం సమావేశంలో మోటివేషన్ స్పీకర్ పూర్వ ఎంఈఓ గుర్రం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్త బోధన పద్ధతులు, విషయ పరిజ్ఞానం మరియు సాంకేతిక పరిజ్ఞానం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం. సమయ నిర్వహణ వంటి నైపుణ్యాలను మెరుగుపరచు కోవాలన్నారు సానుకూల వైఖరిని పెంపొందించుకోవడం సానుకూల దృక్పథాన్ని అవలంబర్చుకోవడం నిరంతరం నేర్చుకోవడం సవాలను స్వీకరించడం అవసరమని అన్నారు ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడానికి ధ్యానం, ఆయామం, యోగ ఇతర పద్ధతులను ఉపయోగించాలన్నారు, ఈ కార్యక్రమం లో సరస్వతి స్కూల్ ఉపాధ్యా యులు పాల్గొన్నారు




## విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత....

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : విద్యార్థులు విద్యా పట్ల ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హెూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చందా నగర హుడా కాలనీలో బీటెక్ విద్యార్థిని మనీషా తో పాటు 4 విద్యార్థులకు క్లబ్ సభ్యులు రూ 75,000 వేల రూపాయలు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండ విజయ్ మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు చేయూత అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు బర్క మల్లేష్, బసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చుక్కపల్లి సాంబశివ రావు, గాలి కృష్ణ, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, సింగ దాసరి రాజశేఖర్ తో పాటు తల్లితండ్రులు కార్యక్రమంలో ఉన్నారు.



# నేడు కార్గిల్ విజయ దినోత్సవం

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, జూలై 26.భారత సరిహద్దుల వద్ద వాస్తవాధీన రేఖను దాటి, మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్థాన్ సైన్యాన్నిసుమారు 80 రోజుల వీరోచిత పోరాటంతో తరిమికొట్టి1999 జూలై 26న "ఆపరేషన్ విజయ్" విజయవంతంగా పూర్తి చేసిన భారత సైనికులకు వందనాలు తెలుపుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను అర్పించిన 527 మంది వీర సైనికులకు నివాళి అర్పించివారి ధైర్యం, సాహసం, త్యాగం భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది అని వారి త్యాగాలకు యావత్ భారతదేశం పాదాభి వందనాలు చెస్తోంది,అని మాట్లాడడం జరిగిందిఈ రోజు బీజేపీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో "కార్గిల్ విజయ్ దీవస్" సందర్భంగా అమరులైన వీర జవాన్లకు కొవ్వతులతో నివాళులు అర్పించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధవేని మహేష్ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్ ఎర్ర రాజేందర్ తాజా మాజీ కౌన్సిలర్లు మాడవేణి నరేష్ పెండెం గణేష్ సీనియర్ నాయకులు రాచమడుగు శ్రీనివాసరావు గిన్నెల శ్రీకాంత్ ఉపాధ్యక్షులు ఉరుమాండ్ల బ్రమ్మం కముటం ఉదయ్ ఆది పల్లి మహేష్ గౌడ్ తోట రాజేశం ముల్క ఆంజనేయులు కిషన్ మోర్చా అధ్యక్షులు నారాయణరెడ్డి కార్యదర్శులు మ్యకల గణేష్ చేట్టిపల్లి ఓం ప్రకాష్ బీజేవైఎం నాయకులు అందుర్తి రమేష్,పంబాల అజయ్, సంకు రమేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అలరించినా వారాంతపు సంస్కృతిక కార్యక్రమాలు..

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో నీ శిల్పారామం లో సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ శ్రీమతి కిరణ్మయి బోనాల ఆధ్వర్యం లో రెండు రోజుల " భారతీయ నృత్యన్వయ మహోత్సవ" ఏ ఫెస్టివల్ అఫ్ పరంపర ఉత్సవాన్ని శనివారం ప్రారంభించారు. పద్మశ్రీ అవార్డీ డాక్టర్ పద్మజ రెడ్డి శిష్య బృందం "కాకతీయం" నృత్య రూపకాన్ని ప్రదర్శించారు మరియు శ్రీమతి కిరణ్మయి బోనాల కుమార్తె లు పదవర్ణం మరియు రామచరితం ప్రదర్శించారు. ప్రెసిడెంట్ ప్రజ్ఞాభారతి శ్రీ శ్రీనివాస్ వెంట్రప్రగడ గారు ముఖ్య అతిధిలుగా విచ్చేసి కళాకారులను గురువులను సత్కరించారు.



## దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన కార్గిల్ అమర జవాన్లకు సెల్యూట్

### బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి లింగంగౌడ్

మిర్యాలగూడ , జూలై 26:- (వార్త మిర్రర్) : కార్గిల్ అమర జవాన్ల దినోత్సవం సందర్భంగా వారి పోరాటాన్ని తలుచుకొని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమర జవాన్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ పాకిస్తాన్ పై 1999 కార్గిల్ యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ గా నిర్వహిస్తారన్నారు. యుద్ధంలో ఎంతోమంది వీర జవాన్లు తమ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేశారన్నారు. మంచు శిఖరాలపై మూడు నెలల పాటు వీర జవాన్లు పాకిస్తాన్ తో వీరోచితంగా పోరాడి వారి సైన్యాన్ని చిత్తుగా ఓడించి కార్గిల్ ను స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య ధోనీటి శేఖర్, పిచ్చయ్య, తుకారం, ప్రసాద్, సైదులు పాల్గొన్నారు




## ఎస్సార్ పాఠశాలలో విజయ్ దివస్

మిర్యాలగూడ జూలై 26:-( వార్త మిర్రర్) దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల చరిత్ర విద్యార్థులకు వివరించాలనీ స్థానిక డి ఎస్పి కె. రాజశేఖర్ రాజు అన్నారు. స్థానిక ఎస్ ర్ డిజి స్కూలులో శనివారం కార్గిల్ అమరవీరులను స్మరించుకుంటూ, విజయ్ దివస్ నిర్వహించిన సందర్భంగా కార్యక్రమంలో అమర జవాన్లకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృదేశం కోసం వీరోచితంగా సైనికులు పోరాడిన విషయాన్ని విద్యార్థులకు తెలిపారు. అకడమిక్ చీఫ్ మనోజ్, డిఎం లక్ష్మణ్ రావు, స్నేహలత, ప్రిన్సిపాల్ జానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.నిర్వహించిన సందర్భంగా కార్యక్రమంలో అమర జవాన్లకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృదేశం కోసం వీరోచితంగా సైనికులు పోరాడిన విషయాన్ని విద్యార్థులకు తెలిపారు. అకడమిక్ చీఫ్ మనోజ్, డిఎం లక్ష్మణ్ రావు, స్నేహలత, ప్రిన్సిపాల్ జానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీలక్ష్మి ఫాస్ట్ ఫ్యూల్ బంకును ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి.

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... జూలై 26 ... రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి శంషాబాద్ మున్సిపాలిటీ రాళ్ల గూడ రోడ్ లో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి ఫాస్ట్ ఫ్యూల్ బంకును రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు . పి. సబితా ఇంద్రా రెడ్డి ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సబితా ఇంద్రారెడ్డి కి కార్తీక్ రెడ్డి కి నాయకులకు శ్రీ లక్ష్మీ పెట్రోల్ బంకు యాజమాన్యం బి సతీష్, బి. మహేష్ ఘన స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భారత భవిష్యత్తు కోసం కుటుంబ విలువలను ప్రోత్సహిస్తూ ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 26...ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండ గవర్నమెంట్ మేటర్నిటీ హాస్పిటల్ సహకారంతో ఒక ప్రత్యేక ఫెర్టిలిటీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం Value Family for India Vibrant Future' అనే థీమ్‌తో, యువత, మహిళలకు కుటుంబ నిర్మాణ ప్రాధాన్యత, ఫెర్టిలిటీ ఆరోగ్యంపై సమయానుకూల అవగాహన, మరియు తల్లి – శిశు ఆరోగ్య రక్షణ వంటి అంశాలను చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జలగం కావ్యరావు (రీజినల్ మెడికల్ హెడ్), డాక్టర్. సంధ్యారాణి, డబ్ల్యూ ఓ జి ఎస్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, డబ్ల్యూ ఓ జి ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రాధిక, ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ ఆర్ ఎం ఓ డాక్టర్ అంబరీష్, పలు గౌరవనీయ వైద్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో జయ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని తమ సహకారం అందించారు.ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం – కుటుంబ నిర్మాణంపై సమాజ అవగాహన కోసం అని వైద్యులు వెల్లడించారు.భారతదేశంలో తగ్గుతున్న జననాల రేటు, భవిష్యత్ తరాలకు పెద్ద సవాలుగా మారుతోంది.ఈ నేపథ్యంలో సమాజంలో ఫెర్టిలిటీ ఆరోగ్యం, సమయానుకూల వైద్య సలహా, తల్లితనం అవగాహన పై చర్చలు జరపడం అత్యంత అవసరం. యువతలో ఈ అవగాహన పెంపొందించడానికి వైద్య నిపుణులు శాస్త్రీయ సమాచారం పంచుకున్నారు మరియు ఐవిఎఫ్ వంటి ఆధునిక చికిత్సలపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు.సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించబడింది. ఇది భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ మరియు కుటుంబ నిర్మాణానికి ఒక సంకేతాత్మక చిహ్నంగా నిలిచింది. ఈ కార్యక్రమం పూర్తిగా సామాజిక ప్రయోజనాల కోసం నిర్వహించబడింది. గవర్నమెంట్ మేటర్నిటీ హాస్పిటల్ వైద్య సిబ్బంది, జయ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, స్థానిక మహిళా సంఘాలు, మరియు సమాజ ప్రతినిధులు విస్తృతంగా పాల్గొన్నారు.వైద్యుల అభిప్రాయాలుడాక్టర్ దుర్గ జి రావు మాట్లాడుతూ"ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండటం సమాజ అభివృద్ధికి పునాది. మహిళలు సమయానికి సరైన




సమాచారాన్ని పొందడం ద్వారా తల్లితనం దిశగా ధైర్యంగా ముందుకు సాగగలరు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో ఆ అవగాహన కల్పించడం మా ప్రధాన ఉద్దేశ్యం."డాక్టర్ జలగం కావ్యరావు మాట్లాడుతూ"ఫెర్టిలిటీ అనేది కేవలం వైద్య అంశం మాత్రమే కాదు %-% ఇది కుటుంబాల భవిష్యత్తుకు సంబంధించిన విషయం. మహిళలు మరియు యువత ఫెర్టిలిటీ ఆరోగ్యంపై మాట్లాడేందుకు, సమయానుకూల సలహా పొందేందుకు ప్రోత్సాహం కల్పించడం అవసరం. ఈ అవగాహన ద్వారా అనేక కుటుంబాలు సకాలంలో సహాయం పొందగలవు."ఈ కార్యక్రమం భవిష్యత్‌లో మరిన్ని ప్రాంతాల్లో కూడా నిర్వహించి సమాజానికి ఉపయోగపడేలా చర్యలు చేపట్టనున్నారు.

## 45వ మహంకాళి పోచమ్మ బోనాల జాతరకు విచ్చేస్తున్న భక్తులకు స్వాగతం.. సుస్వాగతం

### నాగోల్ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్



నాగోల్ వార్త మిర్రర్ ప్రతినిధి : నాగోల్ గ్రామం నాగోల్ డివిజన్ లో నవ చైతన్య యువజన సంఘం, శ్రీశ్రీశ్రీ మహంకాళి పోచమ్మ మరియు మైసమ్మ దేవస్థానం కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించు బోనాలకు విచ్చేస్తున్న భక్తులకు స్వాగతం తెలిపారు నాగోల్ గ్రామ అధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ఈ బోనాల మహోత్సవానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, నాగోల్ డివిజన్ 11 కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పోచంపల్లి రాజేందర్ రెడ్డి, పోచంపల్లి మనీష్ రెడ్డి విచ్చేస్తున్నారు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడాల నిర్వహించే ఈ బోనాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు



## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ జూలై 26 :- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం దుబ్బతండాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మాడుగులపల్లి మండల కేంద్రంలోని స్కూల్, కాలేజ్ లను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, ఫుడ్ మెనూ పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.ఎలాంటి అవసరం ఉన్నా సంప్రదించండి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.అలాగే హాస్టల్లో నీటి సదుపాయం సరిగా లేదని తెలియజేయడంతో అతి త్వరలో సమస్యని పరిష్కరిస్తామని అన్నారు.

## అక్షర స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### - విద్యార్థిని చితకబాదిన అక్షర స్కూల్ టీచర్



కల్వకుర్తి జూలై 26 వార్త మిర్రర్ ప్రతినిధి:- రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో అక్షర స్కూల్ విద్యార్థిని చితకబాదిన టీచర్సాయంత్రం ఇంటికి రాగానే విద్యార్థి తన తల్లిదండ్రులతో ఏడుస్తూ దెబ్బలు చూపించగా చేతి ఏళ్ల అచ్చులు కనిపించడంతో అక్షర స్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థి తల్లిదండ్రులు కొట్టిన దెబ్బలని చూపించగా మేము కొట్టలేదని బుకాయిస్తున్నారు.విద్యార్థులు చదువుకోవడానికి వేల రూపాయలు ఖర్చు చేసి చదివిస్తుండగా కొందరు టీచర్స్ వారికి విద్యార్థుల పట్ల ఎందుకు ఇంత క్రూరంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.తక్షణమే అక్షర స్కూల్ యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఇలా ఏ విద్యార్థిని కొట్టకూడదని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



## కైతాపురం రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన.. రాచకొండ సి పి సుధీర్ బాబు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 26హైదరాబాద్-విజయవాడ హైవే చౌటుప్పల్ మండలం గ్రామం కైతపురం స్టేజ్ వద్ద ఉదయం 5 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతుండగా ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు పోలీస్ అధికారులు డి.ఎస్.పి చక్రధర్, శాంతారావు మృతి చెందారు. ఈ సంఘటన స్థలాన్ని రాచకొండ సి పి సుధీర్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు, ఈ పరిశీలనలో ట్రాఫిక్ డిసిపి మనోహర్ ఎసిపి చౌటుప్పల్ పెద్దల పోలీసులు పాల్గొన్నారు..




## సిపిఐ మహాసభ కరపత్రాన్ని సిపిఐ ఆవిష్కరణ..

### జిల్లాకార్యవర్గసభ్యులు బచ్చనగోని గాలయ్య

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 26

చౌటుప్పల్ మండల కేంద్రంలో సిపిఐ మహాసభ కరపత్రాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా మండలం వలిగొండ లో నిర్వహించే మంగళవారం రోజున 29 వ తేదీన సిపిఐ 4వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య అన్నారు.జిల్లాలో ఉన్న ప్రజాసమస్యలు పరిష్కారం కోసం సిపిఐ అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే%శీ%దుకు ప్రభుత్వాలు కృషిచేయాలనీ అన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు లని పూర్తిచేయాలనీ, అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ పతకాలు అందేలా చేయాలని, పైరవీలు లేని పాలనను అందించాలని కోరారు. జిల్లా సమగ్రభివృద్ధి కోసం,ప్రజా పోరాటాల రూపకల్పనకు జిల్లా మహాసభ లో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని,ఈ మహాసభ కు జిల్లాలోని అన్ని మండలాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి,పిల్లి శంకర్, ఉడుత రామలింగం, ఏవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, దాసరి అంజయ్య, రోషణగారి అంజయ్య, నీళ్ల బిక్షపతి, కుంటి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ వాటర్ సప్లయి గేట్ వాల్వ్, ఆటో స్వాధీనం

### నలుగురు దొంగలు అరెస్టు ఇన్స్పెక్టర్ మోతిరామ్

మిర్యాలగూడ, జులై 26:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపాలిటీకి చెందిన విలువైన పాత ఇనుమును అపహరించిన నలుగురు దొంగలను అదుపులోకి తీసుకొన్నట్లు ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ సిహెచ్.మోతీరామ్ తెలిపారు. శనివారం ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గాంధీ నగర్ కు చెందిన కేదారి కోటేష్, కత్తుల సాయికుమార్, ఉబ్బపల్లి వేణు, ఈగల రాకేష్ లు ముఠాగా ఏర్పడి పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో మున్సిపాలిటీ వాటర్ ట్యాంకు వాచ్మెన్ గదిలో సుమారు టన్ను బరువున్న గేట్ వాల్వ్ ఉండగా, దానిపై కన్నేసిన సదరు నిందితులు ఈనెల 23న దొంగిలించి సమీపంలోని కంపచెట్ల మధ్యలో దాచి పెట్టారు. గేట్ వాల్వ్ ను పాత ఇనుము షాపులో అమ్ముకునేందుకు శనివారం కేదారి కోటేష్ కు చెందిన ఆటోలో తరలిస్తుండగా, రాజీవ్ చౌక్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఒన్ టౌన్ పోలీసులు వాహనాన్ని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చోరికి గురైన వాల్వ్ విలువ సుమారు రూ.80,000లు ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీల ఆదేశం మేరకు కేసును చాకచక్యంగా చేదించిన ఒన్ టౌన్ ఎస్ఐ ఏ.సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ దైద సైదులు, కానిస్టేబుల్స్ సిహెచ్.వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్ లను ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మిర్యాలగూడ, జులై 26:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డ్ లోనీ విట్రోస్ బ్లాంకెట్ హాల్లో ఈ నెల 27న సాయంత్రం 7 గంటలకు రోటరీ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ 2025-26 నూతన కార్యవర్గం 48వ ఇన్స్టాలేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు రేపాల అంతయ్య తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్షులుగా రాయపూడి భవాని, సెక్రటరీగా వాసవి రేపాల అంతయ్య కార్యవర్గం ప్రమాణ స్వీకారం, బాధ్యతలను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైండ్ పవర్ వరల్డ్ రికార్డర్ టి వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ టి రాజశేఖర్రెడ్డి, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జె.మురళి లు హాజరుకానునట్లు రేపాల అంతయ్య తెలిపారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ అన్ని కార్యవర్గ కార్యవర్గాలు, రోటరీ క్లబ్ సీనియర్ లీడర్లు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపకుండా నాటకాలు ఆడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి




నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపకుండా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శనివారం నాడు నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 42 శాతం బిసి రిజర్వేషన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని రాష్ట్ర శాసనసభ, మంత్రి వర్గం ఆమోదించి గవర్నర్‌కు పంపారని గుర్తు చేశారు. బిల్లుపై గవర్నర్ సంతకం తర్వాత కేంద్రప్రభుత్వానికి పంపినా చట్టం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గరకు రాష్ట్రప్రభుత్వాలు చేసిన బిల్లులను పంపితే వాటిని ఆమోదించకుండా సంవత్సరాల తరబడి సమయం పడుతుందని విమర్శించారు. ఆయా రాష్ట్రాల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని బిల్లులు తయారు చేసి పంపితే ఎందుకు ఆమోదించడంలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు గడువు పూర్తయి రెండేండ్లు కావస్తున్నా కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 42శాతం బిసి రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం జరిపి కేంద్ర ప్రభుత్వం దగ్గరకు ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్లి రిప్రెజెంటేషన్ చేయాలని కోరారు. సకాలంలో ఎన్నికలు జరగకపోవడం వల్ల స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన గ్రాంట్ చెల్లించకపోవడం వలన సమస్యలు పేరుకపోయాయని అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాలు మరియు మురికి కూపాలుగా మారాయని, ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్థానిక సంస్థలు పారిశుధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. సోమవారం నాడు జరిగే రాష్ట్ర క్యాబినెట్‌లో ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డి.మల్లేషం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీళ, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మినారాయణ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# యూరియా నిల్వలు,అక్రమ అమ్మకాల నివారణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు : కలెక్టర్



వార్త మిర్రర్ మల్యాల ప్రతినిధి (జూలై 26): జగిత్యాల జిల్లాలో యూరియా సరఫరా, నిల్వలు, అక్రమ అమ్మకాలు మరియు వ్యవసాయేతర ఉపయోగాలకు ఎవరైనా వినియోగించినటువంటి కార్యకలాపాలపై పర్యవేక్షణ నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 8977751769 ను ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు లేదా సమాచారం అందించాలనుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని కావునా రైతులందరూ సద్వినియోగం చేసుకోగలరని, ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.



## భారతమాత సిగలో ఎర్రని గులాబీలై వికసించిన అమర జవానులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 26 : భారతమాత తలపై మెరిసే మంచు కిరీటం కాశ్మీర్, కాశ్మీర్ కోసం కయ్యానికి కాలు దువ్విన పాకిస్తాన్ ను ఓడించి భారతమాత సిగలో ఎర్రని గులాబీలై వికసించిన అమర జవానులకు నివాళులు అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్ అన్నారు. శనివారం రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వీర సైనికులకు పట్టణంలోని భరతమాత చౌక్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్సీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, కోశాధికారి బెక్కం తిరుపతి, ఉపాధ్యక్షులు వాసం స్వామి, క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కాటి పెల్లి రామ్ రెడ్డి, కొయ్యేడి మహిపాల్, వాసం ప్రసాద్, కళ్యాణ్, వెంకట్ రెడ్డి, సుదవేణి మురళి గౌడ్, ఆడెపు రాంప్రసాద్, బొమ్మ కంటి నవీన్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా ప్రజలకు ధర్మపురి పోలీసుల విజ్ఞప్తి

## గోదావరి నది పరివాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎ. రాంనరసింహ రెడ్డి, ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 26 : గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఎగువ ప్రాంతాలైన కడెం ప్రాజెక్టు నుండి గోదావరి నదిలోకి భారీగా నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ధర్మపురి పరిధిలో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం అధికమైంది.ఈ సందర్భంగా స్థానిక ధర్మపురి ఎస్ఐ ఉదయ్ కుమార్ తో కలసి గోదావరి నదిని సందర్శించటం జరిగింది. ఈ సందర్భంగా నది పరివాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పలు సూచనలు చేయటం జరిగింది. 1. గోదావరి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. కావున భక్తులు స్నానానికి వెళ్ళేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. 2. నదిలో చేపలు పట్టేందుకు లేదా పశువులను మేపేందుకు వెళ్లకూడదు. 3. వర్షం సమయంలో చెట్ల కింద ఉండకూడదు పిడుగుపాటు ప్రమాదం ఉండవచ్చు. 4. రైతులు వ్యవసాయ బావుల వద్ద కరెంట్ మోటర్లను జాగ్రత్తగా వినియోగించాలి. 5. శిథిలమైన ఇళ్లలో నివసించకూడదు. 6. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. 7. విద్యుత్ స్థంభాలు మరియు పరికరాలకు దూరంగా ఉండండి. 8. వాహనదారులు వేగంగా ప్రయాణించకుండా, రోడ్లపై నీటి ప్రవాహాన్ని పరిశీలించి, జాగ్రత్తగా ప్రయాణించాలి. 9. కల్వర్టులపై అజాగ్రత్తగా దాటే ప్రయత్నాలు చేయవద్దు. 10. అత్యవసర సమయంలో డయల్ 100 ద్వారా పోలీసు సహాయం కోరగలరని, అందరూ జాగ్రత్తగా ఉండి, అధికారుల సూచనలు పాటించగలరని కోరుతున్నాం అని ఎ. రాంనరసింహ రెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ధర్మపురి సర్కిల్ ఒక ప్రకటన లో కోరారు.



# సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి

## జోన్-6లో 28 మందికి అవకాశం

## హర్షం వ్యక్తం చేసిన టీజీఆర్ఎస్ఏ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 26రాష్ట్రంలోని జోన్–6లో రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించడం పట్ల తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాలిపెల్లి ఆనంద్ కుమార్, చిట్యాల భూమయ్య హర్షం వ్యక్తం చేశారు. 28 మందికి పదోన్నతి కల్పించడం పట్ల డిప్యూటీ కలెక్టర్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరెడ్డి కి, రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షులు బాణాల రాంరెడ్డి కి సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ కు, ప్రభుత్వ పెద్దలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.



# బాజాపా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్

## యుద్ధానికి నేటికీ 26 ఏళ్ళు!

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 26 : భారత భూభాగాన్ని ఆక్రమించుకొని కుట్ర పన్నిన పాకిస్థాన్ కు మన దేశ ఆర్మీ పరాక్రమాన్ని రుచి చూపించింది, ఆపరేషన్ విజయ్, పేరిట కార్గిల్ నుంచి యుద్ధభేరి మోగించి శత్రు సేనలను తరిమి కొట్టింది, ఇది జరిగి నేటికీ సరిగ్గా 26 ఏళ్లు పూర్తయింది. కార్గిల్ కొండల నుంచి శ్రత్రు మూకలను తరిమికొట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నేడు 'కార్గిల్ విజయ్ దివస్'ను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని కుట్ర పన్నిన పాకిస్థాన్‌కు ఇండి యన్ ఆర్మీ పరాక్రమాన్ని రుచి చూపించిన రోజు ఇది. ఆపరేషన్ విజయ్' పేరిట కార్గిల్ నుంచి యుద్ధభేరి మోగించి శత్రుసేనలను తరిమికొట్టిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జులై 26 కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో రాగిల్ల సత్యనారాయణ, ఇట్నేని రమేష్, కాయితి శంకర్, రాపర్తి రాజు, జ్ఞానేశ్వర్, బైరి రాజేందర్, రామచందర్, రాగిల్ల ప్రణయ్, రాగిల్ల భార్గవ్, గణేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితుడికి ఆర్ ఎస్ కె ఫౌండేషన్ చేయూత.!

## షేక్ జమాల్ కు ఆర్థిక సహాయం అందించిన... డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామానికి చెందిన షేక్ జమాల్ క్యాన్సర్ బారినపడి గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా నిరుపేద మైనార్టీ కుటుంబం కావడంతో బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తన వంతు సహాయంగా 5000/వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని తెలిపారు ఈ ఆర్థిక సహాయం అందజేత కార్యక్రమంలో తాజ్ పూర్ గ్రామ యువకులు, మైనార్టీ యువకులు పాల్గొన్నారు

## చరిత్ర సృష్టించిన భారత రైల్వే..

## దేశంలో మొట్ట మొదటి హైడ్రోజన్‌తో నడిచే ఇంజన్ ఇదే!

మన భారత రైల్వే మరో చరిత్ర సృష్టించింది. రోజురోజుకు టెక్నాలజీలలో దూసుకుపోతోంది. ప్రయాణికుల ప్రయాణాన్ని మరింత మెరుగ్గా ఉండేందుకు సరికొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పుడు హైడ్రోజన్‌తో నడిచే ఇంజన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ట్వీట్ చేశారు..భారత రైల్వే చరిత్ర సృష్టించింది. శుక్రవారం రైల్వేలు హైడ్రోజన్‌తో నడిచే రైలును విజయవంతంగా పరీక్షించాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (%×జఖీ%)లో ఈ ట్రయల్ నిర్వహించారు. ఆగస్టు చివరి నాటికి భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్‌తో నడిచే రైలును నడపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది జింద్–సోనిపట్ మధ్య దాదాపు 90 కి.మీ. దూరం నడుస్తుంది. ఈ హైడ్రోజన్ రైలును కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ధృవీకరించారు. టెస్ట్ రన్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనితో పాటు, దాదాపు 35 ఇలాంటి రైళ్లను నడపడానికి ప్రణాళిక ఉంది. దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్‌తో నడిచే రైలు ప్రత్యేకత ఏమిటో తెలుసుకుందాం?ఇది నాన్–ఏసీ రైలు అవుతుంది. దీనికి 2 హైడ్రోజన్ ఇంధన శక్తి ఇంజిన్లు ఉంటాయి. దీనితో పాటు దీనికి 8 ప్యాసింజర్ కార్లు అంటే కోచ్‌లు ఉంటాయి. ఈ రైలును ఉత్తర రైల్వే జింద్–సోనిపట్ ట్రాక్‌పై నడుపుతుంది. దీని వేగం గంటకు 110 కిలోమీటర్లు ఉంటుంది. 1200 హార్స్‌పవర్ ప్రోటోటైప్ హైడ్రోజన్ ఇంజిన్‌ను ఐసిఎఫ్ అభివృద్ధి చేస్తోంది. ఈ రైలు తక్కువ దూరాలను కవర్ చేయడానికి అభివృద్ధి చేసింది.ఇది కూడా చదవండి:ఈ నాలుగు రాశుల వారు పేదరికంలో పుట్టినా ధనవంతులవుతారట!ఐసిఎఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు డెక్కన్ హెరాల్డ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మొదటి పవర్ కారుగా పిలిచే దీనిని పరీక్షించామని చెప్పారు. రెండవ పవర్ కారును రాబోయే రెండు వారాల్లో పరీక్షిస్తారు. దీని తర్వాత, మొత్తం రైలును పరీక్షిస్తారు. ఇందులో 8 ప్యాసింజర్ రైళ్లు ఉంటాయి. ఆగస్టు 31 నాటికి మొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును నడపాలని ప్లాన్ చేస్తున్నామని అన్నారు. తుది పరీక్షను ఉత్తర రైల్వే నిర్వహిస్తుంది. 2023లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభకు తెలియజేశారు. భారత రైల్వేలు "హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్" చొరవ కింద 35 హైడ్రోజన్–శక్తితో నడిచే రైళ్లను నడపాలని యోచిస్తున్నాయని అన్నారు. ప్రతి రైలుకు రూ. 80 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. కొండ మార్గాల్లో మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వడానికి ఒక్కో రూట్‌కు రూ. 70 కోట్లు ఖర్చవుతుంది. ఉత్తర రైల్వేలోని జింద్–సోనిపట్ విభాగంలో నడపడానికి సిద్ధంగా ఉన్న హైడ్రోజన్ ఇంధన కణాలతో కూడిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ తిరిగి అమర్చడానికి రూ. 111.83 కోట్ల విలువైన పైలట్ ప్రాజెక్ట్ కూడా ప్రారంభించినట్లు చెప్పారు. హైడ్రోజన్ రైళ్ల ప్రారంభ రన్నింగ్ ఖర్చు ఎక్కువగా ఉండవచ్చు. కానీ కాలక్రమేణా అది తగ్గుతుందని భావిస్తున్నారు.



## పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత నేత్ర వైద్య శిభిరము విజయవంతం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 26 : లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల రిజియన్ VI జోన్ II రేకుర్తి కంటి ఆసుపత్రి మరియు పద్మ శాలి సేవా సంఘం, జగిత్యాల వారి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిభిరము శ్రీ భక్త మార్కండేయ దేవాలయము లో తేది 24.07.25 నాడు పద్మశాలి సేవా సంఘం ఆవరణలో జరిగినది. అధ్యక్షులు వడ్లగట్ట శంకర్ మాట్లాడుతు, రేకుర్తి కంటి ఆసుపత్రి నుండి అనుభవజ్ఞులు అయిన డాక్టర్లు వచ్చి దాదాపు 100 మంది కంటి చూపు సరిగా లేని వారికి, కంటి శుక్లాలు ఉన్న వారిని పరీక్షించితే అందులో 35 మందికి కంటి శుక్లాలు ఉన్నట్టు గుర్తించడం జరిగింది. వారిని కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి, వీరితో పాటు వీరి సహాయకులకు ఉచిత బస్సు సౌకర్యం తో పాటు ఉచిత భోజన సౌకర్యం కల్పించి రేకుర్తి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి, మళ్లీ జగిత్యాల్ కు శని వారం రోజు తీసుకురావడం జరిగింది అని తెలిపారు. మున్ముందు నిర్వహించబోయే ఉచిత నేత్ర వైద్య శిభిరమును అందరు సద్వినియోగం చేసుకువాలని కోరారు. యిట్టి కార్యక్రమములో ప్రధాన కార్యదర్షి గుండేటి గంగాధర్, కోశాధికారి సామల్ల శ్రీ హరి, చార్టర్ అధ్యక్షులు శ్రీరాముల సుదర్శన్, డీసీఎంసి తాటిపాముల వినోద్ కుమార్, ప్రోగ్రాం చేర్ పర్సన్స్ వడ్ల గట్ట గోపి, దొపటి దేవదాసు, ముల్లె రాజ్ కుమార్, పాల్గొన్నారు.



## పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 26 ...అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ 2025–26 సంవత్సరానికి ఇన్వెస్టిచర్ వేడుక శనివారం ఘనంగా జరుపుకుంది. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల అధికారిక ప్రవేశ వేడుకగా ఇది.పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, విద్యార్థులకు సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది. ఇన్వెస్టిచర్ వేడుక పాఠశాల క్యాలెండర్‌లో ఒక ముఖ్యమైన సంఘటన. ఇది విద్యార్థులలో బాధ్యత నాయకత్వ సంస్కృతిని పెంపొందించడంలో పాఠశాల అంకితభావాన్ని సూచిస్తుంది. ఈ సంవత్సరం ఇన్వెస్టిచర్ వేడుకకు రాజేంద్రనగర్‌లోని ఏసీపీ (ట్రాఫిక్) బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే గౌరవ అతిథి రామకృష్ణ పవిత్ర జ్యోతి వెలిగించడంతో వేడుక ప్రారంభమైంది. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు ముఖ్య అతిథి బ్యాడ్జ్‌లను ప్రదానం చేశారు. దీని తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం, పాఠశాల జెండాను ఆవిష్కరణ జరిగాయి.ముఖ్య అతిథి కొత్తగా ఎన్నికైన పాఠశాల క్యాబినెట్ సభ్యులను అభినందించారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ కోడూరు కొత్త కౌన్సిల్ సభ్యులను అభినందించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.